క్లుప్తంగా

నేడు లోక కళ్యాణార్థం చంద్ర వ్రతం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాఘ మాసం సోమవారం పురస్కరించుకుని లోక కళ్యాణార్థం శివజ్ఞాన పీఠాధిపతి శివాచార్య స్వామి వారి చేతుల మీదుగా శివజ్ఞానపీఠంలో చంద్ర వ్రతం (సోమ వ్రతం) నిర్వహించనున్నట్లు పీఠం ఆర్గనైజర్ పేర్ల శ్యాంప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 5.30 గంటలకు చంద్రవ్రతం ప్రారంభమవుతుందన్నారు. మానసిక ఆందోళన నివారణ , లోక కళ్యాణార్థం చేపట్టిన శ్రీచంద్ర వ్రతంలో భక్తులు ఉచితంగా పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు వ్రతంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

అంకమ్మతల్లి శక్తి పీఠంలో ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీకాలనీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో మాఘమాసం ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. పీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి ప్రీతికరమైన శ్రీచక్రార్చన, కుంకమ పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

యూజీడీ పనులు వేగవంతం చేయాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): యూజీడీ పనులు వేగవంతం చేసి నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని 30వ డివిజన్ కార్పొరేటర్ బీహెచ్ఎస్‌వీ జానారెడ్డి సూచించారు. గద్దె వెంకట్రామయ్యనగర్ ఆచంట వెంకటరత్నం నాయుడు సర్కిల్‌లో యూజీడీ పంపింగ్ స్టేషన్ నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన యూజీడీ పంపింగ్ స్టేషన్ నిర్మాణ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత త్వరలో పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కూచిపూడి కళాకారిణికి వాషింగ్టన్ యూనివర్సిటీ డాక్టరేట్



లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ నగరానికి చెందిన కూచిపూడి కళాకారిణి బి.స్వర్ణలతకు అమెరికాలోని జార్జ్ వాషింగ్టన్ యూనివర్సిటీ ఆఫ్ పీస్ నుంచి గౌరవ డాక్టరేట్ లభించింది. ఈ నెల 24న బెంగుళూరులో జరిగిన అంతర్జాతీయ పీస్ కాన్ఫరెన్స్‌లో యూనివర్సిటీ పలు రంగాలకు చెందిన వారికి డాక్టరేట్లు ప్రదానం చేసింది. అందులో భాగంగా కూచిపూడి కళాకారిణి స్వర్ణలతకు డాక్టరేట్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా నీతి అయోగ్ ఐఈఎస్ సలహాదారు శివప్ప, సెక్రటరీ జనరల్ డాక్టర్ శ్రీనివాస్ ఏలూరి, ఆ యూనివర్సిటీ డైరెక్టర్ నీలమణి తదితరుల నుంచి డాక్టరేట్ అందుకున్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



పాయకాపురం(విజయవాడరూరల్): ఆంధ్రప్రభ కాలనీలోని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు కార్యాలయంలో ఆదివారం సీపీఎంకి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ లో చేరారు. 62వ డివిజన్ సీపీఎం శాఖ కార్యదర్శి కూరపాటి నాగరాజు ఆధ్వర్యంలో తన అనుచరులు వెలంపల్లి శ్రీనివాసరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి వెలంపల్లి శ్రీనివాసరావు పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అలంపూరు విజయ్, బోరా బుజ్జి, రామిరెడ్డి, మహేష్, డివిజన్ ఇన్‌చార్జి మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: వ్యక్తి అదృశ్యం అవడంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ టి.రామారావు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన నడకుదటి సాయిలక్ష్మి, యశ్వంత్‌వర్మ భార్యాభర్తలు. వీరికి ఒక బాబు. యశ్వంత్‌వర్మ హైదరాబాద్‌లోని ప్రైవేటు కంపెనీలో పని చేస్తాడు. కాగా గత ఏడాది క్రితం యశ్వంత్‌వర్మ బంధువుల బంగారం తీసుకుని బ్యాంకులో తాకట్టు పెట్టి అతని పేరున రుణం తీసుకుని బంధువులకే ఆ సొమ్ము ఇచ్చాడు. అయితే రుణం తీసుకున్న సమయంలో అదనంగా లక్ష రూపాయలు తీసుకున్నాడు. బంధువులు సొమ్ము బ్యాంకులో కడదామని చెప్పడంతో సాయిలక్ష్మి, యశ్వంత్‌వర్మ ఈ నెల 21వ తేదీన యనమలకుదురు వచ్చారు. ఈ నెల 23వ తేదీన బ్యాంకులో సొమ్ము కట్టడానికి విజయవాడ బయలుదేరగా మార్గం మధ్యలో యశ్వంత్‌వర్మ అదృశ్యమయ్యాడు.

మధురానగర్‌కు మహర్దశ

- కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు
- ప్రజలకు మెరుగైన నదుపాయాలు
- చిరకాల కోరికలు తీరిన వైనం

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మధురానగర్‌కు మహర్దశ పట్టింది. ఈ ప్రాంత ముఖచిత్రంలో పెనుమార్పులు వచ్చాయి. గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురయిన 29వ డివిజన్ మధురానగర్‌లో ఎమ్మెల్యే మల్లాది విష్ణు కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు పూర్తి చేశారు. రెండు కాలువలు, రైల్వే ట్రాక్ మధ్యన భౌగోళికంగా వైవిధ్యంగా ఉన్నప్పటికీ మధురానగర్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అభివృద్ధి పనులు చేపట్టారు. మధురానగర్ వాసులతో పాటు నాలుగు డివిజన్ వాసుల చిరకాల కోరికగా ఉన్న కర్మల భవనం, కమ్యూనిటీ హాలు, ఓపెన్ జిమ్ పూర్తిచేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. అమృత్ పథకంలో భాగంగా 24 గంటలూ నిర్విరామంగా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్‌యూబీ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. లెక్చరర్స్‌కాలనీలో రూ. 15 లక్షల వ్యయంతో ముత్తవరపు శ్రీనివాసరావు నగరాజకుమారి ఉద్యానవనం సుందీకరించారు. అలానే ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. ప్రజల్లో ఒత్తిడిని తొలగించటంతో పాటు శారీరక ఆరోగ్యం కోసం ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయటం పట్ల స్థానికులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. అమృత్ పథకంలో భాగంగా డివిజన్‌లో 24 గంటలూ తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఇందుకుగానూ అవసరమైన పైపులైన్‌లు ఏర్పాటు చేసి నాణ్యమైన తాగునీటిని సరఫరా చేస్తున్నారు.



ఇందిరాకాలనీలో యూజీడీ, రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు (ఫైల్)



లెక్చరర్స్ కాలనీలో సుందరంగా తీర్చిదిద్దిన ఉద్యానవనం



మధురానగర్‌లో నూతనంగా నిర్మించిన రోడ్డు

సుందరంగా రోడ్లు...

రూ.1.15 కోట్లతో కొబ్బరితోట నుంచి శివాలయం వంతెన వరకు యు.వి.నరసరాజు రోడ్డులో సీసీ రహదారి, రూ. 28 లక్షలతో ఇందిరాకాలనీ రామాలయం రోడ్డు, రూ. 30 లక్షలతో తోట కేదారేశ్వరరావు రోడ్లను నిర్మించారు. అలాగే ముదిరాజ్ కళ్యాణమండపం రోడ్డు, నేతాజీ రోడ్డు, ములక్కాయల వీధి, కొబ్బరితోటలలో సీసీ రోడ్లు వేశారు. రూ. 20 లక్షల వ్యయంతో మధురానగర్ రైల్వే గేటు నుంచి యు.వి.నరసరాజు రోడ్డు వరకు బీటీ రోడ్డును పునరుద్ధరించారు. .

చిరకాల సమస్యకు పరిష్కారం...

తరచూ యూజీడీ లీకేజీలు గోతులతో అధ్వానంగా మారిన ఇందిరానగర్ కాలనీలో శాశ్వత ప్రాతిపదికన కొత్త యూజీడీ పైపులైన్లు ఏర్పాటు చేసి సీసీ రోడ్లు వేశారు. పెరిగిన ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులు పూర్తిచేశారు.

రూ. 42లక్షలతో కర్మల భవనం...

నాలుగు డివిజన్ వాసుల సౌకర్యార్థం మధురానగర్ వాసుల చిరకాల స్వప్నంగా మిగిలిన కర్మల భవనంను రూ. 42 లక్షల వ్యయంతో పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. పేద మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా కర్మల భవనంను నిర్మించారు.

రూ.17 కోట్ల తో ఆర్‌యూబీ పనులు...

నాలుగు డివిజన్ వాసుల సౌకర్యార్థం మధురానగర్‌లో రూ. 17 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఆర్‌యూబీ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ నెలాఖరుకు ఆర్‌యూబీ పనులు పూర్తిచేసి ప్రారంభించటానికి సన్నాహాలు చేస్తున్నారు.



ఓపెన్ జిమ్

మోడల్ డివిజన్‌గా మధురానగర్



మధురానగర్ అంతలా అభివృద్ధి చెందిన ప్రాంతం సెంట్రల్ నియోజకవర్గంలోనే మరొకటి లేదు. ముఖ్యంగా ఈ ప్రాంతంతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉండగా ఈ ప్రాంతమంతా సిమెంట్ రోడ్లు వేయించాము. సీసీ రహదారులు, యూజీడీ, వంతెనల నిర్మాణంతో మధురానగర్ ముఖచిత్రమే మారిపోయింది. ప్రజల చిరకాల కోరికలను నెరవేర్చటం సంతోషంగా ఉంది. **-మల్లాది విష్ణు,** రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే

అభివృద్ధి పనులు పూర్తిచేశాం



గత ప్రభుత్వం హయాంలో ఇక్కడ సమస్యలు విలయతాండవం చేశాయి. తాము అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే మల్లాది విష్ణు సహకారంతో ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తిచేశాం. ప్రజలకు ఎన్నో రకాల సదుపాయాలు కల్పించాం. అనేక అభివృద్ధి పనులు పూర్తి చేశాం.
కొంగితల లక్ష్మీపతి, కార్పొరేటర్

మధురానగర్‌కు ప్రత్యేక స్థానం



మధురానగర్‌ను అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే మల్లాది విష్ణుకే దక్కుతుంది. ప్రజల చిరకాల వాంఛగా ఉన్న కర్మల భవనంను నిర్మించటంతో పాటు, ఆర్‌యూబీ పనులు తుది దశకు చేరుకోవటం ఆనందంగా ఉంది. నగరంలో మధురానగర్‌కు ప్రత్యేకస్థానం లభించేలా చేశారు. **-కంభం కొండలరావు,** న్యాయవాది, మధురానగర్

అభివృద్ధి పరుగులు



ఒకప్పుడు సమస్యలతో ఏ వసతులు లేని మధురానగర్‌కు మధురంగా తీర్చిదిద్దారు. ఆర్‌యూబీ పూర్తయి వినియోగంలోకి వస్తే ఇక్కడ పరిస్థితి మరింతగా మారిపోతుంది. రోడ్లు సుందరంగా తీర్చిదిద్దటంతో పాటు యూజీడీ సమస్యలు పరిష్కరించారు. **-పోలుకొండ శ్రీనివాసరావు,** మధురానగర్, సాయిబాబా కాలనీ



మధురానగర్‌లో కర్మల భవనం

కమనీయం శ్రీవారి మహా పుష్పయాగం

ముగిసిన బ్రహ్మోత్సవాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లో కొలువై ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి మహాపుష్పయాగం ఆదివారం కమనీయంగా జరిగింది. బ్రాహ్మణవీధిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన వివిధ రకాల సుగంధ పరిమళాలను వెదజల్లే పలు రకాల పుష్పాలతో కలియుగ దైవమైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి అర్చకస్వాములు పుష్పయాగాన్ని నయనానందకరంగా నిర్వహించి భక్తులను తరింపజేశారు. గులాబీ, తులసీ, మల్లె, చామంతి వంటి విభిన్న జాతి పుష్పాలతో జరిగిన పుష్పయాగాన్ని తిలకించిన భక్తులు తన్మయులయ్యారు. ఉత్సవమూర్తులను పూర్తిగా పూలతో కప్పే విధంగా వందలాది కిలోల పుష్పాలతో ఈ యాగాన్ని నిర్వహించారు. అలంకార ప్రియుడైన నారాయణుడు ఈ సేవతో మరింత పులికించి భక్తులను అనుగ్రహిస్తాడని పండితులు తెలిపారు. వేద పఠనం, మేళతాళాలు, సంకీర్తనాగానాలు, మంత్రోచ్చరణలు, భక్తులు శ్రీహరి నామ స్మరణల మధ్య స్వామి వారి పుష్పయాగం జరిగింది. ప్రముఖ ఆగమ పండితులు ఆధ్వర్యంలో ప్రధానార్చకులు పాణింగిపల్లి శ్రీరామచంద్రమూర్తి పుష్పయాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఘనంగా తిరుమంజనం

ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారికి తిరుమంజన సేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. పంచామృతాలు, చందనం వంటి సుగంధ పరిమళ ద్రవ్యాలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి అభిషేకించిన అర్చకస్వాములు పలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ, చైర్మన్లు స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. శాశ్వత బ్రహ్మోత్సవ ఉభయ దాతలను, ఉత్సవాలకు సహకరించిన దాతలను సత్కరించారు.



స్వామి వారి పుష్పయాగం

వైభవంగా ద్వాదశ ప్రదక్షిణలు

స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఆలయ ప్రాంగణంలో స్వామి వారి ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేక పల్లకీపై అధిష్టింపజేసి వివిధ రకాల సేవలతో 12 మార్లు ఆలయంలో ప్రదక్షిణలను నిర్వహించారు. మధ్యాహ్నం వేలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు సహకరించిన అందరికీ ఆలయ ఈఓ ఘంటసాల శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ గుడిపాటి పాపారావు పర్యవేక్షించారు.

వీరమ్మతల్లి తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు

ఉయ్యూరు: వీరమ్మతల్లి తిరునాళ్లకు భక్తజనం పోటెత్తారు. ఆదివారం వేకువజాము నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తజనం వేలాదిగా తరలిరావడంతో ఉయ్యూరు పట్టణం వీరమ్మతల్లి నామస్మరణతో మారుమ్రోగింది. డప్పు వాయిద్యాలతో గ్రామాల నుంచి ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకుని భక్తిపారవశ్యం చెందారు. ఆలయ పరిసరాలతో పాటుగా ప్రధాన రహదారులు భక్త జనసంద్రంగా మారాయి. జై వీరమ్మతల్లి.. జైజై వీరమ్మతల్లి అంటూ భక్తులు తమ భక్తిని చాటుకున్నారు. అమ్మవారి దర్శనానికి గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. ఆలయం భక్తులతో నిండిపోవడంతో భక్తులు ధ్వజస్తంభం వద్దే మొక్కులు చెల్లించుకుని వెనుతిరిగారు. సీఐ హబీబ్‌బాషా, ఎస్సై గణేష్ కుమార్ బందోబస్తును పర్యవేక్షించారు.



నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అలంకర్ సబ్ స్టేషన్ నందు 11 కేవీ గాంధీనగర్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ టౌన్ ఈఈ బీవీ సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్, రైల్వే స్టేషన్ రోడ్, సన్యాసిరాజు రోడ్డు, ఫిల్మ్ చాంబర్ రోడ్డు, ఏపీ ఎన్జీవో రోడ్డు.ఆంధ్ర రత్న రోడ్డు.జ్ఞానో లీవ్ రోడ్డు, జీఎస్ రాజు రోడ్, నారా వారి స్ట్రీట్,హిందీ స్ట్రీట్, ఎస్ఆర్‌పీ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాయకాపురం(విజయవాడరూరల్):పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ ఏరియాలో 33/11 కేవీ పాయకాపురం, అజిత్‌సింగ్‌నగర్ ఫీడర్ లైనుల మరమ్మతుల నేపథ్యంలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలియచేశారు. ప్రశాంతినగర్, శాంతినగర్ మెయిన్‌రోడ్డులో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నగరాల కార్పొరేషన్ చైర్మన్ పోతినకు సత్కారం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నగరాల కార్పొరేషన్ చైర్మన్‌గా పోతిన శ్రీనివాసరావుకు అవకాశం కల్పించిన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి శ్రీనగరాల సంఘం ఆంధ్రప్రదేశ్ తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని సంఘ అధ్యక్షుడు ఎన్వీ.రావు పేర్కొన్నారు. కేఎల్ రావు నగర్‌లోని శ్రీనగరాల సంఘం ఆంధ్రప్రదేశ్ కార్యాలయానికి ఆదివారం పోతిన శ్రీనివాసరావు విచ్చేశారు. ఈ సందర్భంగా పోతిన శ్రీనివాసరావును ఎన్వీ.రావుతో పాటు పలువురు సంఘ ప్రతినిధులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. సామాజిక వర్గ ప్రజల ఇబ్బందులను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎన్వీ.రావు కోరారు.

జగనన్నతోనే రామరాజ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పారదర్శక పాలనతో రామ రాజ్యం స్థాపించారని అటువంటి ప్రభుత్వానికి మరో మారు అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు కుమార్తె సాయి అశ్విత కోరారు. వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు కుమార్తె సాయి అశ్విత, అల్లుడు మంచుకొండ చక్రవర్తి తదితర కుటుంబ సభ్యులు డెప్యూటీ మేయర్ అవుతూ శైలజతో కలిసి స్థానిక 58వ డివిజన్‌లో పర్యటించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. వెలంపల్లి శ్రీనివాసరావు పశ్చిమలో చేసిన సేవల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో వెలంపల్లి సోదరులు రాఘవ నర్సింహారావు, రామకృష్ణ, అల్లుడు రాందేవ్ 58వ డివిజన్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల కరపత్రాలు అందిస్తున్న అశ్విత, శైలజ తదితరులు

ఘనంగా లార్డ్ బాడెన్ పావెల్ జయంతి

భవానీపురం(విజయవాడపశ్చిమ): భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకుడు లార్డ్ బాడెన్ పావెల్ జయంతిని పురస్కరించుకుని విద్యాధరపురంలోని బెజవాడ రాజారావు హైస్కూల్‌లో స్కౌట్స్ – గైడ్స్ విద్యార్థులతో ఆల్ ఫెయిత్ ప్రేయర్(సర్వమత ప్రార్థన)ను స్కౌట్స్ ఉపాధ్యాయులు బీఎస్ వరప్రసాద్ చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బెజవాడ రాజారావు మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమానికి ఆద్యుడు బాడెన్ పావెల్ చిరస్మరణీయుడన్నారు. బాల బాలికల్లో దేశభక్తిని పెంపొందించి వారిని సమాజ సేవకులుగా తీర్చిదిద్దటానికి ప్రారంభించబడినదే స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం అని తెలిపారు. ఇందులో బాలుర బృందాలను స్కౌట్స్ అని, బాలికల బృందాలను గైడ్స్ అని అంటారన్నారు. అత్యవసర సమయాల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు రంగంలోకి దిగి సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా బాడెన్ పావెల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



లార్డ్ బాడెన్ పావెల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాజారావు, వరకుమార్

380 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేస్తున్నామని వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్ అన్నారు. దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆరోగ్య అవగాహన, ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము దాతలు, ట్రస్ట్ సభ్యుల సహకారంతో ప్రముఖ అల్లోపతి, ఆయుర్వేదం, హోమియో వైద్యనిపుణులతో ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించటంతో పాటు అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. వయోవృద్ధులు ట్రస్ట్ సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని సూచించారు. ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, హోమియో వైద్య నిపుణులు డాక్టర్ కోనా వీరబ్రహ్మం, డాక్టర్ శరత్‌చంద్ర ఎండలు పెరుగుతున్న దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సీజనల్ పండ్లు కూరగాయలు తీసుకోవాలని సూచించారు. అనంతరం 380 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

● గ్రూప్ - 2 స్క్రీనింగ్ పరీక్ష ప్రశాంతం



ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్ - 2 స్క్రీనింగ్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. నగరంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలకు ఉదయాన్నే అభ్యర్థులు చేరుకోవడంతో కోలాహలం నెలకొంది. ఆయా కేంద్రాల్లో అభ్యర్థులను తనిఖీ చేసిన అనంతరం పరీక్షకు అనుమతించారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించడంతో ప్రశాంత వాతావరణంలో పరీక్ష జరిగింది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







రూ.50 వేల విరాళం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపమ్మవారి ఆలయంలో నిత్యాన్న దాన పథకానికి దాత విరాళం అందజేశారు. ఆదివారం విజయవాడలోని మొగల్రాజపురానికి చెందిన నిమ్మగడ్డ ప్రణీత్ రూ.50 వేలను విరాళంగా ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.